క్లుప్తంగా

కోనేరు నిర్మాణానికి రూ. 50వేల వితరణ



నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కోనేరు నిర్మాణానికి ఇరువురు దాతలు రూ.50వేలు శుక్రవారం వితరణగా అందజేశారు. తెలంగాణ వైరా మండలం సోమవారం గ్రామానికి చెందిన గొల్లపూడి కృష్ణారావు, విజయలక్ష్మిల మనువడు, మనవరాలు రాయల దరహాస్, చిర్యానీలు ఈ మొత్తాన్ని ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులకు అందజేశారు. దాతలను అర్చకులు ఆశీర్వదించి స్వామి ప్రసాదం అందజేశారు.

నేడు డ్వాక్రా గ్రూపులకు ఆసరా నగదు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీ, ఇబ్రహీంపట్నం మండల పరిధి గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల మహిళలకు ఆసరా పథకం నిధులు శనివారం జమకానున్నట్లు మండల ఏపీఎం శోభన్‌బాబు శుక్రవారం తెలిపారు. మూడో విడతలో మొత్తం 1,759 గ్రూపులకు చెందిన 17,590మంది లబ్ధిదారులకు రూ.17,36,21,465 ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా వారి ఎకౌంట్లుకు జమ చేయనున్నారు. ఆయా సంఘాలకు మూడు విడతల్లో ఇప్పటి వరకు రూ.51,99,83,155 నగదు జమ అయినట్ల అవుతుందని ఏపీఎం తెలియజేశారు.

బీజేపీ కక్షపూరిత రాజకీయాలు మానాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బీజేపీ ప్రభుత్వ పెద్దలు కక్ష పూరిత రాజకీయాలు మానుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ అన్నారు. కొండపల్లి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలను చెప్పుచేతల్లో పెట్టుకుని రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష వేయించడంతో పాటు పార్లమెంటు నుంచి బహిష్కరించడం అన్యాయం అని పేర్కొన్నారు. దేశంలో కక్షపూరిత రాజకీయాలు పెరిగాయన్నారు. రాహుల్‌కు జోడో యాత్రలో వచ్చిన ప్రజాధరణ చూసి ఓర్వలేక వేటేశారని తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన

జి.కొండూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం రుచికరమైన పౌష్టికాహారాన్ని అందజేస్తుందని గంగినేని సర్పంచ్ పిల్లి రామారావు అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని గంగినేని గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ అన్నమ్మ పాల్గొన్నారు.

నేడు బాలోత్సవం

తిరువూరు: స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బాలోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ తెలిపింది. 18 అకడమిక్, ఎనిమిది సాంస్కృతిక విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి హరికృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఆసరాతో ఆర్థిక భరోసా

ఆగిరిపల్లి: మూడో విడత ఆసరా సొమ్ము ఈ నెల 25వ తేదీన విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆసరా పథకం మూడో విడత అమలుకు సంబంధించి లబ్ధిదారుల వివరాల సేకరణ వైఎస్సార్ వెలుగు సిబ్బంది ఇప్పటికే పూర్తి చేశారు. గత రెండేళ్లుగా ఆసరా సొమ్ములు తీసుకుంటున్న లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకుంటున్నారు. అర్హత కలిగి ఉండి ఎవరైనా ఏడాదిలోపు మరణించి ఉంటే వారి నామినీకి సొమ్ము చెల్లించేలా నమోదు చేస్తున్నారు. మండలంలో మొత్తం 1,420 డ్వాక్రా గ్రూపులుండగా వాటిలో 1,237 గ్రూపులల్లో 12,734 మంది సభ్యులు ఆసరాకు అర్హత కలిగి ఉన్నారు. మొత్తం రూ.50.23 కోట్లు ఆసరాకు మంజూరయ్యాయి. ఇంతవరకు ఏడాదికి రూ.12.56 కోట్ల చొప్పున రెండు విడతలుగా రూ.25.12 కోట్లు డ్వాక్రా మహిళల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ ఏడాది మూడో విడతగా రూ.12.56 కోట్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జమ చేయనున్నారు.



మూడో విడత లబ్ధిదారులతో సమావేశమైన యానిమేటర్లు

బయోమెట్రిక్ పూర్తి



ఆసరా పథకంలో భాగంగా లబ్ధిపొందిన సభ్యులకు మూడో విడత బయోమెట్రిక్‌ల సేకరణ పూర్తయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నెల 25వ తేదీన నేరుగా వారి ఖాతాల్లోకి ఆసరా సొమ్ము జమ అవుతుంది. లబ్ధిదారులు ఆసరా సొమ్ముతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే సీఎం జగనన్న ఉద్దేశం.

–బొలగాని రామకృష్ణ, ఏపీఎం

రైతులకు న్యాయం చేయాలని వినతి

విజయవాడరూరల్: ఖమ్మం–విజయవాడ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూ సేకరణలో రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో న్యాయం చేయాలని రైతులు జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్‌కు విన్నవించుకున్నారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ గ్రామ సర్పంచ్ వి.సీతారామయ్య, రైతులు విజ్ఞప్తి మేరకు పైడూరుపాడు గ్రామ సరిహద్దులో జక్కంపూడి, రాయనపాడు గ్రామాల పొలాలను పరిశీలించారు. అనంతరం సచివాలయం వద్ద జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జక్కంపూడిలో పొలాలు ఎకరం రూ.72లక్షలు, రాయనపాడులో పొలాలు ఎకరం రూ.36.69 లక్షలు, పైడూరుపాడు గ్రామానికి చెందిన పొలాలు ఎకరం రూ.11.60 లక్షల మార్కెట్ రేటు ఉందని తెలిపారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి విస్తరణకు భూసేకరణలో రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో ఎటువంటి నష్టం లేకుండా పరిహారం చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. గ్రామసభలో మండల తహసీల్దారు పి.జాహ్నవి పాల్గొన్నారు.



పైడూరుపాడు పొలాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

క్షయ నివారణపై అవగాహన సదస్సు

ఇబ్రహీంపట్నం: క్షయ వ్యాధి నివారణపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు సుధాప్రసూజా అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. క్షయ వ్యాధి నివారణకు పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. కొద్దిపాటి అవగాహన, మందుల వాడకంతో టీబీని అరికట్టవచ్చన్నారు. అప్రమత్తత లేకుంటే ఒక వ్యాధి గ్రస్తుడు నుంచి ఏడాదికి 10 నుంచి 15మందికి వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. 'అవును మనం టీబీని అరికట్టవచ్చు' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. యూపీహెచ్‌సీ డాక్టర్ అఖిల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు చేయించుకోవాలి

నూజివీడు: రెండు వారాల పాటు తెమడతో కూడిన దగ్గు వస్తుంటే తప్పనిసరిగా టీబీ పరీక్ష చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ దయాల ఆశ అన్నారు. పట్టణంలోని టీబీ యూనిట్, పీపీ యూనిట్, ఏరియా ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిక్షయ్ మిత్ర ప్రోగ్రామ్ ద్వారా వ్యాధి గ్రస్తులకు పోషకాహార పంపిణీ కార్యక్రమాన్ని ఏరియా ఆస్పత్రిలో నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ వైద్యాధికారి బేగం సబీనా పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ దయాల ఆశ

కష్టపడేవారికి మెరుగైన అవకాశాలు



విద్యార్థిని రాధికకు నగదును అందజేస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం బిక్షాలు

రెడ్డిగూడెం: కష్టపడి చదువుకునే విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కచ్చితంగా వస్తాయని నాగులూరు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.బిక్షాలు తెలిపారు. 2021–22 విద్యా సంవత్సరానికి 10వ తరగతి విద్యార్థిని ఉల్లం రాధిక రెడ్డిగూడెం మండలంలో ప్రభుత్వ రంగ పాఠశాలల్లో అత్యధిక మార్కులు (555/600)తో ఉత్తీర్ణత సాధించినందుకు నాగులూరు గ్రామ దాత కలకొండ రవికుమార్ విద్యార్థినికి శుక్రవారం రూ. 10వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు.

ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఎ.కొండూరు: ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి విద్యను అందిస్తోందని జెడ్పీటీసీ భూక్య గనియా పేర్కొన్నారు. మండలంలోని కేసీయాతండా ఎలిమెంటరీ పాఠశాలలో శుక్రవారం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలనే ఉద్దేశంతో నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లోని అన్ని వసతులు కల్పిస్తున్నారన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జమలమ్మ, వైస్ ఎంపీపీ శివారెడ్డి, పెద్దబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు పర్వతనేని చంద్రమోహనరావు, హెచ్‌ఎం జాన్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న భూక్య గనియా

మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

జూపూడి(ఇబ్రహీంపట్నం): నేటి సమాజంలో మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని నిమ్రా కళాశాల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి అన్నారు. నిమ్రా కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, సేఫ్ సంస్థల ఆధ్వర్యంలో మహిళా సాధికారత సమానత్వంపై అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. సేఫ్ సంస్థ అధ్యక్షురాలు జోత్స్న బాల్య వివాహాలు, వరకట్న నిషేధం అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్, మహిళా విభాగం ఇన్‌చార్జ్ షేక్ షాహీన్ తాజ్, వైస్ ప్రిన్సిపాల్ షరీఫ్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాణి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న నారాయణమూర్తి

బాలామృతంపై అవగాహన

ఆగిరిపల్లి: మండలంలోని అడవినెక్కలం, ఆగిరిపల్లి, కొమ్మూరు, కృష్ణవరం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా బాలామృతంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సగ్గూరు, ఆగిరిపల్లి క్లష్టర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాగమయి, శివకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు.



సుంకొల్లులో రోడ్లను శుభ్రపరిచి రోడ్డు మార్జిన్‌లో బ్లీచింగ్ చల్లుతోన్న వలంటీర్లు

ధార్మిక చింతనల కలయికే రంజాన్

మైలవరం: ధార్మిక చింతనల కలయికే పవిత్ర రంజాన్ పర్వదినం అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలకు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. మహనీయుడు మహ్మద్ ప్రవక్త ద్వారా దివ్య ఖురాన్ ఆవిర్భవించిందని, అందుకే ఈ నెలను రంజాన్ మాసంగా పరిగణిస్తారని పేర్కొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు మందుల పంపిణీ

నూజివీడు: పట్టణంలోని రైడ్స్ టిఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌ఐవీ బాధితులకు ఏఆర్‌టీ మందులను సంస్థ చైర్మన్ బసవరాజు నగేష్ అందజేశారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఏఆర్‌టీ రీఫిల్ గ్రూపును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ఈ సెంటర్ ద్వారా ఎయిడ్స్ బాధితులకు ప్రతినెలా ఉచితంగా ఏఆర్‌టీ మందులను అందిస్తామన్నారు. దీని వల్ల వారిపై ఆర్థికభారం లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి పీ కిరణ్, సీడీసీ షేర్ ఇండియా టెక్నికల్ సపోర్ట్ యూనిట్ అధికారి జాన్, ఏపీ శాక్స్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, రైడ్స్ టీఐ ప్రాజెక్టు మేనేజర్ ఎం.లక్ష్మి పాల్గొన్నారు.



హెచ్‌ఐవీ బాధితులకు ఏఆర్‌టీ మందులను అందజేస్తున్న నగేష్

స్వాహా సొమ్ము అడిగితే దాడి చేసిన బ్యాంక్ కరస్పాండెంట్

మైలవరం: మైలవరం మండలం గణపవరం గ్రామానికి చెందిన వరలక్ష్మి డ్వాక్రా గ్రూపు సభ్యుల సొమ్మును అదే గ్రామానికి చెందిన బ్యాంక్ కరస్పాండెంట్ ఎస్.వినోద్ స్వాహా చేశాడు. తమ సొమ్మును తిరిగి ఇవ్వాలని సభ్యులు బ్యాంక్ కరస్పాండెంట్ ఇంటికి వెళ్లి అడిగినందుకు అతని కుటుంబ సభ్యులు బాధితులపై గురువారం రాత్రి దాడి చేశారు. గణపవరానికి చెందిన వరలక్ష్మీ గ్రూపు సభ్యులు ప్రతి నెలా తమ గ్రూపు సొమ్మును బ్యాంక్ కరస్పాండెంట్ ద్వారా జమ చేస్తున్నారు. అయితే బ్యాంక్ కరస్పాండెంట్ వినోద్ ఆ సొమ్మును బ్యాంక్‌లో పూర్తిగా చెల్లించకుండా రూ.75వేలు వాడుకున్నాడని బాధితులు తెలిపారు. వాడుకున్న సొమ్మును తానే ఇస్తానంటూ నెలల తరబడి గ్రూప్ సభ్యులను ఇంటి చుట్టూ తిప్పుతున్నాడు. ఈ నేపథ్యంలో గత రాత్రి సొమ్ము అడిగేందుకు డ్వాక్రా మహిళలు అతని ఇంటికి వెళ్లారు. వినోద్ బాబాయిలు తమపై దాడికి పాల్పడ్డారని గ్రూపు సభ్యులు తెలిపారు. దాడిలో గాయపడిన మహిళలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలందించారు. తీవ్రంగా గాయపడిన మందా మేరీని మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంబాబు తెలిపారు.



ఆస్పత్రిలో బాధిత మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై

ఆర్యవైశ్య సంఘం సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లికి చెందిన చెందిన గ్రంధి సుబ్రహ్మణ్యం ఈ ఏడాది జనవరిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం చేసేందుకు గ్రామానికి చెందిన ఆర్య వైశ్య సంఘం సభ్యులు ముందుకు వచ్చారు. సంఘం తరపున రూ.2 లక్షలు సేకరించి సుబ్రమణ్యం కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ప్రతి నెలా 25 కేజీల బియ్యం మృతుడి కుటుంబానికి వితరణగా అందిస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నారసింహ, ఆర్య వైశ్య ప్రముఖులు మురళీధర్, ఎం.గోపాలకృష్ణ, కె.ముక్తేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, ప్రణీత్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 30 మంది గైర్హాజరు

నూజివీడు: ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి చెందిన జువాలజీ, గణితం 2బీ, హిస్టరీ పరీక్షకు శుక్రవారం 30 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈ నాలుగు కేంద్రాలలో కలిపి 1,138 మంది విద్యార్థులకుగాను 1108 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలలకు చీఫ్ సూపరింటెండెంట్‌లుగా ఐ.గిరిదేవి, ఈదర కోటేశ్వరరావు, ఎస్.వెంకటలక్ష్మి, కే.సంధ్యాజ్యోతి వ్యవహరించారు.

తిరువూరులో..

తిరువూరు: తిరువూరులో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 307 మంది విద్యార్థులను కేటాయించగా 283 మంది, నాగార్జున జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 245 మందికి 239 మంది, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 340 మందికి 333 మంది హాజరయ్యారు.

అసెంబ్లీ తీర్మానం చరిత్రాత్మకం

నూజివీడు: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఏపీ ఎమ్మార్పీఎస్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి కృపారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళిత క్రైస్తవులను ఎస్సీలుగా మార్చాలని దశాబ్దాలుగా దేశంలో పోరాటాలు చేస్తున్నామని పేర్కొన్నారు.

సహకార వ్యవస్థ మనుగడకు ప్రమాదం

నూజివీడు: కేంద్ర ప్రభుత్వ విధానాలు గ్రామీణ రైతాంగానికి వెన్నెముకగా పనిచేస్తున్న సహకార సంఘాల మనుగడను ప్రశ్నార్థకంగా మారడమే కాక సహకార వ్యవస్థకు మరణ శాసనంగా మారాయని ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరరావు అన్నారు. నూజివీడులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు పరిధిలో 13 జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, 418 బ్రాంచిలకు అనుబంధంగా 1992 పీఏసీఎస్‌లు పని చేస్తున్నాయన్నారు. దాదాపు 70 లక్షల మంది రైతులు సభ్యత్వం కలిగి 18 లక్షల మందికి సేవా దృక్పథంతో రుణ సదుపాయం కలుగచేస్తున్నాయని తెలిపారు. రైతులకు అందించే నగదు సేవలపై పన్ను రూపంలో టీడీఎస్ రెండు శాతం ఈ నెలాఖరు నాటికి వసూలు చేయాలని అన్ని డీసీసీబీలకు ఆదాయపన్నుశాఖ నోటీసులిచ్చిందన్నారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం నాబార్డ్ నుంచి సహకార బ్యాంకులు రీ ఫైనాన్స్ పొందాలంటే సీఆర్ఏఆర్ తొమ్మిది శాతానికి తక్కువ ఉంటే మంజూరు చేయలేమని పేర్కొందన్నారు.

సొసైటీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

పుల్లూరు(మైలవరం): గ్రామాల్లో ప్రైమరీ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ సొసైటీల ద్వారా మంజూరు చేస్తున్న రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు చిలుకూరి రామకృష్ణారెడ్డి తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు సొసైటీ కార్యాలయంలో శుక్రవారం 650మంది సభ్యులకు జ్యూట్ బ్యాగ్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం పాల కేంద్రం అధ్యక్షుడు అప్పిడి సాంబిరెడ్డి, సర్పంచ్ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న రామకృష్ణారెడ్డి

పోషకాహారంతోనే ఆరోగ్యం పదిలం

ముసునూరు: పోషకాహారంతోనే గర్భిణులకు, పుట్టబోయే బిడ్డలకు ఆరోగ్యం పదిలం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. పోషణ పక్వాడ్ పక్షోత్సవాలను పురస్కరించుకుని గుళ్లపూడి–3, కాట్రేనిపాడు–5 అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంతోనే మంచి ఆరోగ్యం అనే అంశాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.



గుళ్లపూడిలో పోషణ పక్వాడ్ మహోత్సవాలు

విద్యతోనే సమాజంలో గుర్తింపు

ముసునూరు: విద్యతోనే సమాజంలో మనిషికి నిజమైన ఉనికి, గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ముసునూరులోని చారిత్రక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు, తమ సీనియర్లు, 10వ తరగతి విద్యార్థులకు అభినందనలు తెలియజేసి, పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ స్థాయి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.



వీడ్కోలు సభలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం నిర్వహణ

నూజివీడు: పట్టణంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మండలంలోని సుంకొల్లులో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఇందులో భాగంగా గ్రామంలో వలంటీర్లు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి రోడ్లపైన, రోడ్ల వెంట, డ్రెయినేజీల్లో చెత్తచెదారం తొలగించి శుభ్రపరిచారు. కార్యకలాపాలను ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి పర్యవేక్షించారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

విస్సన్నపేట: ఎన్టీఆర్ జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన గురుకులాల సమన్వయాధికారి జి.జాన్సన్ దేవరాజ్ శుక్రవారం తెలిపారు. 2022–23 సంవత్సరాలకు సంబంధించి ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ పోస్టులకు బీసీ (ఏ) మహిళ–1, ఓసీ వికలాంగులు మహిళ–1, ఫిజికల్ డైరెక్టర్ కళాశాల ఓసీ మహిళ–1 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 94911 10211లో సంప్రదించాలని తెలిపారు.

రోలుపడిలో జాతీయ సేవా శిబిరం

రోలుపడి(తిరువూరు): మండలంలోని రోలుపడిలో శుక్రవారం తిరువూరు శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం వలంటీర్లు ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. గ్రామంలో పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముండ్లపాటి కాంతమ్మ శిబిరాన్ని ప్రారంభించారు. ముష్టికుంట్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్ బండి రవికుమార్, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, సచివాలయ కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.